క్లుప్తంగా

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



కంకిపాడు: తడి, పొడి చెత్త విభజనపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఈఓఆర్డీ కిరణ్మయి సూచించారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో తడి, పొడి చెత్తపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించటం ప్రయోజనకరమన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో భవిష్యత్తు తరం ప్రమాదంలో పడుతుందని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. తడి, పొడి చెత్త ద్వారా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సంపద సృష్టించటం ద్వారా పంచాయతీల ఆర్థిక వనరులు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలి

పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సీడీపీఓ బేబీ సుకన్య అన్నారు. మండల పరిధిలోని పెనమలూరు, చోడవరం, తాడిగడప, గోసాల, వణుకూరు, గంగూరు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు పోషణ, విద్యపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల విధుల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంకిపాడులో ఈ-పంట సామాజిక తనిఖీ

కంకిపాడు: ఈ-పంట నమోదుతో రైతులకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ సూచించారు. కంకిపాడు పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ఈ-పంట సామాజిక తనిఖీ మంగళవారం నిర్వహించారు. ఈ-పంట నమోదు చేసిన ముసాయిదా జాబితాను రైతుసేవా కేంద్రంలో ప్రదర్శించారు. రైతుల వివరాలను చదివి వినిపించి, ఈ పంట నమోదులో సందేహాలను నివృత్తి చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు బి.జ్వాలా నాయక్, రైతులు పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి ప్రదోష కాలంలో శ్రీమహానందీశ్వరస్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం అలంకరించి అర్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యంపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలం తిప్పనగుంటకు చెందిన ముదుసూరి తేజ నిఖిత(19) ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌ఈ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ నెల 8న ఉదయం కాలేజీ బస్సు ఎక్కి వెళ్లిన తేజ నిఖిత మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అదే రోజు సాయంత్రం ఆమె తల్లిదండ్రులు ఆందోళనతో వెతుకులాట ప్రారంభించారు. స్నేహితులు, బంధువులను ఆరా తీసినప్పటికీ ప్రయోజనం లేకపోవటంతో వీరవల్లి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఆమె తండ్రి కొండలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సర్వేలు పూర్తి చేస్తేనే జీతాలు

- జీతాలు రాక ఇబ్బందిపడుతున్న సచివాలయ ఉద్యోగులు
- నేటికి తేలప్రోలు-1, 2 సచివాలయ సిబ్బందికి అందని జీతాలు



తేలప్రోలు గ్రామ సచివాలయం

ఉంగుటూరు: సచివాలయ ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కూటమి ప్రభుత్వం రాకతో వారి మీద పని భారం మోపి గొడ్డు చాకిరీ చేయించుకుంటుంది. మండలంలో ప్రస్తుతం సర్వే చేస్తేనే జీతం అన్న విషయం గ్రామ సచివాలయ ఉద్యోగులలో ట్రెండింగ్‌గా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగుల మెడపై కత్తిపెట్టి మరీ సర్వేలు చేయిస్తోంది. తాము మాతృశాఖ అధికారి చెప్పే పనులతో పాటు ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగే సర్వేలు కూడా చేయాల్సిన దుస్థితి ఉందని వాపోతున్నారు. దీంతో నిద్రలేని రాత్రులు అనుభవిస్తున్నామని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెల్లవారితే చాలు ఏ అధికారి నుంచి ఫోన్ వస్తుందోనని టెన్షన్ పడుతున్నామని, చివరకు బీపీలు, షుగర్‌లు కూడా వచ్చాయని ఉద్యోగులు వాపోతున్నారు.

ఈ నెల జీతాలు రాలేదు...

మండలంలోని తేలప్రోలు-1, 2 సచివాలయ సిబ్బంది సర్వేలు సక్రమంగా చేయలేదని ఈ నెల జీతాలు బిల్లులు పెట్టకపోవడంతో 11వ తేదీ వచ్చినప్పటికి జీతాలు రాని పరిస్థితి నెలకొంది. మండలంలో 16 గ్రామ సచివాలయాల సిబ్బందికి రాగా తేలప్రోలు-1, 2 సచివాలయ సిబ్బందికి జీతాలు రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క పెరిగిన నిత్యావసర ధరలు, సకాలంలో కట్టాల్సిన ఈఎంఐలు, కుటుంబ సభ్యుల వైద్య ఖర్చులు వెరసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ విధంగా జీతాలు సకాలంలో రాకపోతే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే ఈఎంఐలకు వేలాది రూపాయల జరిమానా చెల్లించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెలా జీతాలు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుని తమను ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బంది అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేసిన వెటర్నరీ విద్యార్థులు



న్యాయం ఎక్కడ అంటూ కూర్చొని నిరసన తెలుపుతున్న వెటర్నరీ విద్యార్థులు

గన్నవరం: ఉపకార వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనను ఉధృతం చేశారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్‌ను పరిష్కరించాలని నెల రోజులకుపైగా రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడంపై మంగళవారం తమ నిరసనను అక్షర రూపంలో ప్రశ్నించారు. కళాశాల ఆవరణలో జస్టిస్ ? అంటూ వరుస క్రమంలో వెటర్నరీ విద్యార్థులు కూర్చొని ప్రభుత్వానికి వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. విద్యార్థులు చేస్తున్న దీక్షలకు వారి తల్లిదండ్రులు కూడా తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. మూగజీవాలకు సేవలందించాలనే ఉన్నత ఆశయంతో వెటర్నరీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. గత 13 ఏళ్లుగా ఉపకార వేతనాలు పెంచకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.7 వేలు స్టైఫండ్ ఏమాత్రం చాలడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు తమ గోడును అర్థం చేసుకొని ఉపకార వేతనాలను కనీసం రూ.15 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ దిశగా ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వచ్చే వరకు తమ శాంతియుత ఉద్యమాన్ని కొనసాగిస్తామని విద్యార్థులు తేల్చి చెప్పారు. స్టైఫండ్ పెంపు కోసం తమ బిడ్డలు చేస్తున్న పోరాటం పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. లేకపోతే తమ బిడ్డలకు మద్దతుగా తాము కూడా నిరసనలో పాల్గొంటామని ప్రభుత్వానికి స్పష్టం చేశారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గన్నవరం సీఐ బీవీ. శివప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యా సంస్థలు పాటుపడాలన్నారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సహించాలని తెలిపారు. ఎన్టీటీఎఫ్ కళాశాల మేనేజర్ కె.పద్మజ మాట్లాడుతూ.. ప్రాథమిక విద్య దశ నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తనను అలవార్చుకోవాలన్నారు. అనంతరం ప్రతిభవంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డి.మాధవీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎన్.చినవెంకట్రాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతను వంచించిన కూటమి సర్కారు



కంకిపాడు: రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి సర్కారు యువతను నమ్మించి వంచించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్ కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో యువతను మోసపూరిత హామీలతో మాయ చేసిన ఘనత కూటమి పెద్దలదేనన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక చదువులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలపై ఫీజుల భారం పడి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. వసతి దీవెన, నిరుద్యోగ భృతి ఊసే లేదని చెప్పారు. విద్యార్థులు, యువత బలవన్మరణాలకు కూటమి నిర్లక్ష్యపూరిత పాలనే కారణమని విమర్శించారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం విద్య, ఉపాధి రంగాలను పూర్తిగా విస్మరించాయన్నారు. అడుగడుగునా వంచిస్తూ, మోసపూరిత విధానాలను అవలంభిస్తూ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు, యువతకు వైఎస్సార్ సీపీ, మాజీ ముఖ్యమంత్రి జగనన్న బాసటగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన యువత పోరును విద్యార్థులు, యువత, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం సాగుతుందని స్పష్టంచేశారు.

ఇంటి పన్నుల పెంపు సమస్య పరిష్కారానికి చర్యలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మేజర్ గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులను విపరీతంగా పెంచటం సామాన్యులకు భారంగా మారిందని, ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారించేందుకు కృషి చేస్తానని జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్నుల పెంపు సమస్యపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. చలమలశెట్టి మాట్లాడుతూ గత పాలకవర్గ హయాంలో ఇంటి పన్నుల పెంపు వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారిందని, దీంతో అప్పటి నుంచి పన్ను వసూళ్లు గణనీయంగా తగ్గిపోయాయని చెప్పారు. పెంచిన ఇంటి పన్నులను సవరించేందుకు ఇప్పటికే ప్రయత్నాలు చేపట్టామని పేర్కొన్నారు. న్యాయస్థానంలోనూ ఈ సమస్యపై పోరాటం సాగిస్తున్నామని టీడీపీ నేత వేగుంట వెంకటరామారావు చెప్పారు. ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించారని కార్మికుల ఆందోళన

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో మంగళవారం ఉదయం రిలయన్స్ గోడౌన్‌లో పని చేస్తున్న 150 మందికి పైగా కార్మికులు ఆందోళన బాటపట్టారు. వారిని అర్థాంతరంగా పనిలో నుంచి తొలగించటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం వరకూ పని చేసిన వీరికి కనీసం ఒక్కమాట చెప్పకుండా మంగళవారం గోడౌన్ గేట్లకు తాళాలు వేయడంతో, కనీసం సమాధానం చెప్పేవారు లేకపోవటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో కార్మికులు గోడౌన్ ఎదుట బైఠాయించి తమకు పని కల్పించి ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకుని ఆందోళనకు సంఘీభావం తెలిపారు. న్యాయం జరిగే వరకూ కార్మికుల వెంట ఉంటామన్నారు. రిలయన్స్‌కు చెందిన హెచ్‌ఆర్ మేనేజర్ వచ్చి 10 రోజులలో జీతాలు ఇప్పిస్తానని, ఆ తరువాత తాము చెప్పిన చోటకు పనికి వెళ్లాలని అఫిడవిట్ ఇచ్చారని కార్మికులు తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలో తాగునీరు వృథాగా పోతుంది. ఈ ప్రాంతంలో రామాలయం సమీపంలోని పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. ఈ పైప్‌లైన్ నుంచి సమీప నివాసాలు, అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీరు సరఫరా అవుతుంది. పైప్‌లైన్ లీక్ అవ్వడంతో తాగునీటి సరఫరాలో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి సమస్యపై ఈ ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ పనులు నిర్వహించే పంచాయతీ సిబ్బందికు ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకూ స్పందించలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోనే మరోక కుళాయి కూడా మరమ్మతులకు గురైన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ వేసవిలో సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ తాగునీటి మోటారు బోర్ల ద్వారా సమయానికి తాగునీరు అందించడం లేదంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

విజయవాడరూరల్: వ్యవసాయ శాఖ రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలన మందును ఉచితంగా అందచేసింది. మంగళవారం రైతుసేవాకేంద్రాల్లో వ్యవసాయసాయ శాఖ సహాయకులు 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల ఆయిల్, రెండు గ్రాముల బ్రోమోడమోలిన్ మందును కలిపి ఎలుకల నిర్మూలను మందును తయారు చేసే విధానాన్ని చూపించారు. అనంతరం చిన్న చిన్న పొట్లాలలో మందును రైతులకు అందజేశారు. రైతులందరూ సామూహికంగా పొలాల్లోని బొరియల్లో పెట్టాలని సిబ్బంది సూచించారు. ఎలుకల నిర్మూలన మందును ఉపయోగించడం వలన వరిపంట దిగుబడులు నష్టపోకుండా కాపాడుకోవచ్చునని చెప్పారు. అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, నున్న గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో ఎలుకల నిర్మూలన మందును అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఉయ్యూరు రూరల్: వీరవల్లి మోఖాసాలో వేంచేసి ఉన్నశ్రీ విజయ గణపతి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సిద్ధి బుద్ధి సమేత విజయ గణపతి ఉత్సవ మూర్తుల చరప్రాణ ప్రతిష్ఠ హైదరాబాద్‌కు చెందిన వేద పండితుల సమక్షంలో వేడుకగా సాగింది. మంగళవారం రాత్రి కల్యాణోత్సవం నిర్వహించారు. బుధవారం గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు తెలిపారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు, అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, బసవ రాజేశ్వరి దంపతులతో పాటు కమిటీ ప్రతినిధులు జొన్నలగడ్డ భవాని ప్రసాద్ జయశ్రీ, మాగంటి రాంబాబు, పద్మావతి దంపతులు, జొన్నలగడ్డ దాక్షాయని, వైష్ణవి, వేదపండితులు వీరేష్ శర్మ, సురేష్ శర్మ, వెంకటేశ్, ఆలయ పూజారి గణేశ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయం



గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 26వ ఇంటర్ పురుషుల ఫేజ్-1 క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేతలకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బహుమతులు అందజేసి మాట్లాడారు. వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయమన్నారు. వైద్య విద్య అభ్యసించే ప్రతి ఒక్కరు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూనివర్సిటీ కూడా క్రీడలను ప్రోత్సహించేందుకు బడ్జెట్ కేటాయిస్తోందని చెప్పారు. 26వ పురుషుల క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు.

విజేతలకు ట్రోఫీలు అందజేత..

కబడ్డీలో విన్నర్‌గా రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, రన్నర్‌గా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల నిలిచాయి. వాలీబాల్‌లో విన్నర్‌గా విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాల, రన్నర్‌గా గుంటూరు మెడికల్ కళాశాల నిలిచాయి. బాస్కెట్ బాల్‌లో విన్నర్‌గా గుంటూరు ఎన్నారై మెడికల్ కళాశాల, రన్నర్‌గా డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల నిలిచాయి. బాల్ బాడ్మింటన్‌లో విన్నర్‌గా విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల, రన్నర్‌గా విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల నిలిచాయి. చెస్‌లో విన్నర్‌గా కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల, రన్నర్‌గా అనంతపూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు మలినేని రాజయ్య, కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ వదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ బీవీశర్మ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవినేని రవి పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

గన్నవరం: మండలంలోని పలు రేషన్ దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రెండు రేషన్ దుకాణాల్లో రికార్డుల్లో కంటే బియ్యం హెచ్చుతగ్గులు ఉన్నట్లుగా గుర్తించిన అధికారులు సదరు డీలర్లతో పాటు ఎండీయూ ఆపరేటర్‌పై కేసులు నమోదు చేశారు. తొలుత మండలంలోని కేసరపల్లిలోని 28వ నంబర్ రేషన్ దుకాణంలో విజిలెన్స్ సీఐ ఉమర్, పీడీఎస్ ఇన్‌చార్జి డీటీ ప్రధాని నేతృత్వంలో తనిఖీలు జరిపారు. మొత్తం ఐదు క్వింటాళ్ల బియ్యం రికార్డుల్లో కంటే తక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. సదరు రేషన్ దుకాణం డీలర్ శేషయ్యపై పీడీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం స్థానిక బుద్దవరం రోడ్డులోని 13వ నంబర్ రేషన్ డిపోలో తనిఖీలు చేసిన అధికారులు 13 క్వింటాళ్ళ బియ్యం స్టాక్ బుక్‌లో కంటే ఎక్కువగా ఉన్నట్లుగా నిర్ధారించారు. అయితే సదరు రేషన్ డీలర్ జయంత్ సదరు బియ్యం ఎండీయూ ఆపరేటర్ లాగిన్‌లో కొట్టినప్పటికీ అతను సరుకు తీసుకువెళ్లలేదని, అందుకే స్టాక్ ఎక్కువగా చూపిస్తోందని అధికారులకు వివరణ ఇచ్చారు. అయితే సదరు ఎండీయూ ఆపరేటర్ వద్ద 13 క్వింటాళ్ల బియ్యం తక్కువగా చూపించడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో రేషన్ డీలర్‌తో పాటు ఎండీయూ ఆపరేటర్‌పై కేసు నమోదు చేశారు.

15న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జోగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ వి.సరోజిని అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రేపు కవయిత్రి మొల్లమాంబ జయంతి

నున్న(విజయవాడరూరల్): ఈ నెల 13వ తేదీన కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతుందని కృష్ణాజిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐలాపురం వెంకయ్య, ఐలాపురం రాజా, ఐలాపురం భాస్కర శ్రీనివాసరావు హాజరవుతున్నారని, కుమ్మరి, శాలివాహన కులస్తులందరూ పాల్గొనాలని కోరారు.